# 'రామచంద్రుడు'

కాలింగ్ బెల్ విని వెళ్ళి తలుపు తీశాను. రామచంద్రుడు... ఎదురుగా! లోపలికి వచ్చాడు.

''అమ్మా! బాగున్నావా?'' అన్నాడు.

''ఆ!'' అంటూ చూశాను.

మనసు కలచినట్లయింది. కళ్ళు లోపలకిపోయి మొహంలో గుంట లేర్పడ్డాయి. లోపలికి పోయిన కళ్ళు చితికినీళ్ళు కారుతున్నట్లున్నాయి.

మొహం నిండా ముడుతలు. దళసరి అద్దాలతో ఎగుడుదిగుడుగా ఉన్న కళ్ళజోడు. చేతిలో చింకి గొడుగు. కాళ్ళకి లెక్కపెట్టలేనన్ని అతుకులు వేసిన చెప్పులు... మాసిన పంచె... వదులుగా ఉన్న చొక్కా... బక్కచిక్కిన శరీరం!

ఒకనాటి గొప్ప కట్టడానికి శిథిలంలాగ ఉన్నాడు.

ఇదివరకు బాగా ఉండేవాడు.

నేను ఈ ఊరికి కొత్తగా కాపరానికి వచ్చినరోజుల్లో ఒకరోజు

''రా, లోపలికి. బాగున్నావా!'' అని ఆయన ఎవరినో పలకరించటం వినిపించింది.

''ఎవరా!'' అనుకుంటుంటే

''ఇటురా. రామచంద్రుడు వచ్చాడు'' అంటూ పిలిచారాయన.

''ఎవరొచ్చారో... ఆఫీసు స్నేహితులో... అయినవాళ్ళో అనుకుంటూ వచ్చాను.

''ఇతనా!'' అనిపించింది చూసిన వెంటనే.

నుంచుని ఉన్నాడు. పంచె, షర్టు అతడు చదువు, ఉద్యోగం లేని మామూలు మనిషి అని చెప్పేస్తున్నాయి.

''కూర్చో'' అన్నాడు నన్ను చూస్తూ.

చిరాకువేసింది. అక్కడ కూర్చుని ఏం చెయ్యాలని!

''నమస్కారమమ్మా! మిమ్మ చూద్దామనే వచ్చాను. ఆహా... తల్లీ... ఏం రూపం! చక్కగా ఉన్నావు తల్లీ... బాబుకి తగ్గట్టున్నావు. ఆముఖమే చెబుతోంది సుగుణాలరాశి అని...'' అంటున్నాడు.

అప్రయత్నంగా నవ్వు వచ్చేసింది. ఆయనా నావేపుచూసి నవ్వారు.

''కూచో అమ్మా. బాబు పక్కన కూచో. నాముందు సిగ్గుపడకు తల్లీ... పెద్దాడిని. మీ ఆయన్ని... ఈబాబుని ఎత్తుకుని ఆడించాను. నా ముందర సిగ్గుపడకు.'' ఆయన పక్కన కూచున్నాను.

''పనిలోకి వెడుతున్నావా?'' ఆయన అడిగారు.

గొడుగు క్రిందపెట్టి కూర్చున్నాడు... నేలమీద.

'అదేగదు బాబూ. ఇప్పుడొచ్చిన చిక్కు. గొప్ప కష్టం వచ్చింది బాబూ.

ఆ లం... కొడుకు నామీద కోపం పట్టాడు''

''ఎందుకూ?''

''ఎందుకేటి బాబూ. ఆడు లండన్నించి వొచ్చాడుగానీ బురదలో ఇత్తనాలు గుచ్చేసి పైన మట్టి జల్లియించేశాడు. లోన యిత్తనాలన్నీ కుళ్ళి పోయినాయి. మొక్క మొలవలేదు. నేను అప్పుడే అన్నాను... ''నువ్వు పెద్దోడివే ఫెర్నాండిస్, లండన్నించి వొచ్చావే కానీ సిల్ట్ యు నో నతింగ్'' అన్నాను. నెల తిరిగింది. నా ఉద్యోగం పోయింది. నాచేత కాయితం మీద సంతకం పెట్టించినాడు. ప్రమోషన్ ఇప్పిస్తానన్నాడు. నాకు తెలీకపోయింది. రిజైన్ ఉత్తరం రాసి సంతకం పెట్టించాడు. ఇంకేం చేస్తాను బాబూ!'' అన్నాడు. మొహం వేలాడిపోయింది.

''మరి ఇప్పుడేం చేస్తున్నావ్' ఆయన ప్రశ్నించారు.

''ఏం చేస్తాను బాబూ... సత్యం పనిలోకెడుతున్నాడు. ఆడి భార్య ఆణ్ణి వొదిలేసింది. పిల్లలకి ట్యూషన్ చెప్పుకుంటున్నాను. అక్షరాలు చెప్తాను, అంకెలు చెప్తాను... డాక్టరుగారి బాబుని కూర్చోబెట్టి. ఈ పంచెలచాపు ఇచ్చారు బాబూ. ఏదో మీ దయ్యవల్ల...''

''మధ్యలో నా దయేమిటి!''

''అమ్మా. అట్లాగనకండి బాబూ. పాపం వొస్తుది. అంతా మీ దయ. మీ నాన్నగారు మహారాజు! నేను రాగానే 'ఏమోయ్ రామచంద్రం, బాగున్నావా? ఈకుర్చీలో కూర్చో... ఈ ఉప్మా తిను... ఇంకో రెండు పూరీలు పట్రాయే అని ఆర్డర్ చేసేవారు. ఎంత మర్యాద చేసేవారు! ఆరోజులు మరి రావండి బాబూ. జీతం తెచ్చేవోరా, భార్యని పిలిచేవారు కాదు. రామచంద్రా! ఆ అల్మైరాలో ఎట్టు అని నాచేతికిచ్చేసేవోరు. నేనంటే గొప్ప నమ్మకం. దొంగతనం మా వంశంలో లేదు''

''టీ తాగుతావా?'' అడిగి ఆయన నావేపు చూశారు.

''ఏదో మీ దయ. రంగంలో ఉండగా అలవాటయిందమ్మా... టీ తాగటం''

''అక్కడ ఏం చేసేవాడివి?'' ప్రశ్నించాను కుతూహలంగా.

గొప్ప ఉద్యోగం తల్లీ. అప్పుడిట్లా ఉండేవాడినా! ఏం రీవి... ఏ ఓడైనా మన దగ్గర ఆగాల్సిందే. ఇట్లా దుర్బిణిలో చూసేవాడిని. వాడు కెప్టెనైనా మరేవడైనా సరే... నీ పేరేమిటి? ఏం సరుకుంది? ఎంత ఉంది... రాసెయ్యటం. సరంగు పనిచేసేవోణ్ణి. 1935లో బొంబార్డుమెంటయింది. వొచ్చేశాను... అప్పటినుంచి సుకం నేదు తల్లీ. ఫారంలో పని. ముగ్గురు పిల్లలు. కొడుక్కి పెళ్ళి చేస్తే కోడలొదిలేసింది. కూతురికి పెళ్ళి చేస్తే దాన్ని అల్లుడొదిలేశాడు. అంతా నామీదే. కూతురికి రెండువేలు ఖర్చుపెట్టి పెళ్ళిచేశాను. నాగరం, జడకుప్పెలూ చేయించాను. వాడి మొహమ్మండ... తాగుతాడు. ముందరనించే ఇంకో గుంటని ఉంచాడు...''

''కోడలెందుకురాదూ'' అడిగాను.

''ఈడు దాన్ని సినిమాకి తీసికెళ్ళలేదుట.. పూలుకొనిపెట్టలేదుట. నువ్వేం మొగాడివి అని మొహంమ్మీదే అనేసి పుట్టింటికెళ్ళిపోయింది.

మారు మనువాడుతుందిట. పోనీలే - బాబూ, అమ్మ ఏం చదివారు?''

''మెట్రిక్'' అన్నారాయన.

''బాగుంది. మంచి చదివున్న తల్లి. నీ ఇల్లు కలకలా వెలిగిపోతది.

మీకు ప్రెజెంటు తెద్దామనుకున్నాను. బల్లమీదెట్టి మరిచిపోయాను.

రాధాక్రుష్ణుల బొమ్మ. జ్ఞాపకం తగ్గిపోతోంది బాబూ... పెద్దోడినైపోతున్నా...''

''సరే! నువ్వు బహుమతి తేవద్దు'' అన్నారాయన ఖచ్చితంగా.

''లచ్చనంగా పెళ్ళి చేసుకున్నారు'' పేదోడినైతేమాత్రం ఉత్తచేతుల్తో వస్తానా? ఈసారి మరిచిపోకుండా తెస్తాను.'' అన్నాడు.

టీతోబాటు కారబూందీ, లడ్డూ ఇచ్చాను.

''దీర్ఘ సుమంగళీభవ!'' దీవించాడు.

ఆయన చెప్పారు. రామచంద్రడు డైరీఫారంలో పనిచేసేవాడుట.

కొడుకు కూతురు వీళ్ళింట్లో పనిచేసేవారుట... మాలి... పిల్లల్ని ఆడించటం, భార్యని మాత్రం పనికి వెళ్ళనిచ్చేవాడు కాదుట.

''వెళ్ళొస్తానమ్మా. బాబూ పెళ్ళిచేసుకుని వచ్చారు. మరి కొత్తపంచ ఇప్పించరా! నిన్ను ఆశీర్వదిస్తున్నాను. నీకు ప్రమోషను వస్తుంది. ఎవరైనా

నీమాట వినాల్సిందే. నువ్వు కారు కొంటావు. మీరు వైభోగంగా ఉంటారు. నూరేళ్ళకీ కలకాలం మీరు చిలకాగోరింకల్లా ఉంటారు. మళ్ళీ ఈరోజుకి అమ్మకొడుకు నెత్తుకుంటుంది. మీకేం కష్టం ఉండదు. అన్నీ మా ఆవిడే చూసుకుంటుంది. అమ్మని కాలు కింద పెట్టనీదు.''

'ఊరికి కొత్తగా వచ్చారు. బితుకు బితుకుగా ఉంది. ఎందరో వచ్చారుకానీ ఇంత హామీ ఎవ్వరూ ఇవ్వలేదు. రామచంద్రుడు ఎంతో తెలిసినమనిషిలా బంధువులా అనిపించాడు. ఆయన ఒక కొత్తపంచ ఇచ్చారు.

ఆనందంగా అందుకున్నాడు.

''నాకు తెలుసు నువ్వు ఇస్తావని. ఇది నాహక్కు బాబూ. నిన్ను ఆడించాను. నన్ను క్షణం వదిలేవాడివి కాదు. మీ నాయన నిన్ను కారులో తీసుకెడుతుంటే నన్నుకూడా ఎక్కమనేవాడివి. వెళ్ళొస్తానమ్మ. వస్తుంటానులే. బెంగెట్టుకోకు. బాబు నీకేం లోటు చెయ్యరు.'' అంటూ వెళ్ళాడు.

అప్పటికి ఆరోగ్యంగానే ఉన్నాడు. పొట్టిగా దృఢంగా ఉన్నాడు. చిన్నకళ్ళు కొంచెం లోపలికి... నీలంగా... చురుకుగా. కొంటెతనం మాటల్లో.

ఒకపక్క తను గొప్పవాడినంటూనే ఏమీ లేదంటాడు. మాటలతో బోర్లా కొట్టిస్తాడు. మంచివాడో, భట్రాజో, అవకాశవాదో, ఆత్మీయుడో తేలదు.

ఉన్నంతసేపూ వినోదం కలిగిస్తాడు. వెళ్ళగానే ''నాలుగు కబుర్లు చెప్పి కావల్సింది రాబట్టుకుంటాడు'' అనిపించేది. వస్తూనే ఉండేవాడు. చిరపరిచితుడు!

ఇప్పుడిట్లాడగయిపోయాడు. జాలివేసింది. కాలం తెచ్చే మార్పు.

పాలరాతి భవనాలు వెలిసిపోతాయి.

నవనవలాడే చెట్లు పుష్పించి ఫలించి రాలిపోతాయి.

ఇంకెన్నాళ్ళో బ్రతకడు. బాగా సంపాదించుకుంటుంటేనే గడవటం లేదు ఈరోజుల్లో. ఎట్లా బ్రతుకుతున్నారో! ఐదో పదో ఇవ్వటం తప్ప మేము చేసిన సాయం లేదు.

''అంతా బాగున్నారా?'' అన్నాను.

''ఆ, మీదయవల్ల.'' అన్నాడు. మెల్లిగా జేబులోనించి ఒక కార్డు తీశాడు.

''ఆ మద్దిన మారెండోవాడికి ఉద్యోగం అయిందని చెప్పినాను గదూ. ఆడికి పెళ్ళి చేస్తున్నాను. ఇదిగో ఇన్విటేషను. మీరు రావాలమ్మా. బాబుగార్ని కూడా లాక్కురావాల. ఆపిల్ల మాకు కావలసిందాయే. నాకు వరసకి బావవుతాడు. వాడి కూతురు. ఐదో క్లాసు చదివింది. కట్నం రెండువేలు. వాచీ, ట్రాన్సిస్టరు, సూటు పెడతారు పెళ్ళికొడుక్కి. అమ్మాయికి పదితులాల బంగారం

ఉంది. మా వెంకట్ అదృష్టం. గొప్ప సంబంధం. పిల్ల బంగారంబొమ్మ - నల్లగా ఉంటేనేం! మేం బీదోళ్ళమని రావటం మానకు తల్లీ. నీ ఆశీర్వాదం కావాలి.''

''అట్లాగే వస్తాలే.'' అన్నాను. ఐదు రూపాయలిచ్చాను. ఎప్పుడొచ్చినా ఇస్తాను.

''ఓ పాతచీర ఇప్పించమ్మా. మా యావిడ మరీమరీ అడిగింది. నీచేత్తో ఇచ్చి చాలారోజులైంది.''

''రెండువేలు ఖర్చుచేసి పెళ్ళి చేస్తున్నాడు. నా పాతచీరెందుకు!'' నవ్వుకున్నాను. ''చూస్తాలే. ఇప్పుడేం లేవు. స్టీలుగిన్నెలు కొన్నాను.'' అన్నాను.

* * *

కాలింగ్‌బెల్ మోగుతోంది.

వెళ్ళి తలుపుతీశాను. ఎదురుగా రామచంద్రుడు.

''రా... రా...'' అంటూ లోపలికి తప్పుకున్నాను.

లోపలికి వచ్చి తలుపేశాడు. చెప్పులు విప్పి గొడుగు మూలపెట్టాడు.

అలాగే నిలబడిపోయాడు.

అప్పుడు చూశాను. కళ్ళలోంచి నీళ్ళు జలజలరాలుతున్నాయి.

మొహంలో జీవకళ లేదు. విగ్రహం ఏడుస్తున్నట్లుగా ఉంది.

కంగారుపడిపోయాను,.

''ఏమైంది... ఏమైంది...'' అన్నాను.

కండువాకొసతో కళ్ళు తుడుచుకున్నాడు.

''మా వెంకటు చచ్చిపోయాడమ్మా!''

షాక్ తిన్నాను.

''అదేమిటి? పెళ్ళయింది...''

''అవునమ్మా. అన్నీ అయాయి.''

జాగా చూసుకుని డ్రాయింగురూమ్ గుమ్మంలో కూర్చున్నాడు.

''అట్టా కుర్చీలోకూర్చో తల్లీ. వినుకో. అంతా చెప్తాను. ఈగుండెలో భారం దింపుకుంటాను. ఇంత కష్టం ఎవరికీ వద్దు తల్లీ. నా శత్రువుకి కూడా వద్దు. పెళ్ళి అయిందా. పదితులాల బంగారం వాళ్ళు బెట్టిన్రు. వాడికి సూటు, రిస్టువాచి, ట్రాన్సిస్టర్ ఇచ్చారు.

''ఔను. మంచి సంబంధం. పెళ్ళి బాగా అయింది.''

''ఔను గదా తల్లి. ఆరునెలలు దివ్యంగా గడిచాయి. మరి కంపెనీవాడికేం వచ్చిందో ఉద్యోగం ఊడబెరికేసారు. పందిరి పైకి పాగిన తీగెని పీకెయ్యటానికి వాడికి చేతులెలావచ్చాయో... వీడితోబాటు ఇంకో నలుగురిని తీసేసారు.

వాళ్ళకేం నొప్పి తల్లీ... డబ్బు మూలుగుతుంటుంది. ఎద్దునొప్పి కాకికి తెలుస్తుందా తల్లీ... పాలసీ అంటారు. ప్రాఫిటు లేదంటారు. దొంగ కొడుకులు. ఏమంటేనేం మానోట్లో మట్టికొట్టేశారు. సరేనా... వాడు ఇంట్లోనే కూకోడం. కూరలేదు... నారలేదు. చాయ్ కూడా లేదు. నేను చూస్తే ముసలాడ్నైపోయాను.... ట్యూషను చెప్తూనే ఉన్నాను. పదిరూపాయలు చేతబెడుతున్నారు. నాభార్యకి మాయరోగం...''

''సరే, ఏమైంది?''

''ఏమౌతుంది తల్లీ! రోజూ ఇంట్లో తిట్టుకోడాలు, ఏడ్పులూ. కోడలుపిల్ల చదువుకున్నది. గొప్పింటిది కదా! దానికి చీరలు, సినిమాలు కావాలి. చేపలు కావాలి. లేనిది ముద్ద దిగదు. 'మానాన్న కట్నం ఇవ్వలేదా.. ఆడబ్బేమైంది?' అంటుంది. దిక్కుమాలిన సంబంధం చేశారంటుంది...

''దేవుడా నన్నెత్తుకు పో'' అని ఏడుస్తుంది నా భార్య.

వాడు నాకొడుకు ఇంటిగుమ్మం దాటడు. నలుగురిలోకీ వెళ్ళనంటాడు.

ఇంకో నౌకరీ వెతకమంటే ఏం లేదంటాడు.

''మీరిట్లా గొడవచేస్తే ఈమాత్రలు తిని చస్తాన'ని బెదిరించాను.

నాభార్యకి నిద్రపట్టటానికి డాక్టర్‌బాబు నిద్రమాత్రలు ఇచ్చారు.

కంట్రాక్టుపని అవుతోంది. దొరబాబుని అడిగివచ్చాను కాళీలున్నాయా అని. నెలపోయాక రమ్మన్నాడు. గంజినీళ్ళు తాగుతున్నాము. తెల్లారేపొద్దు రాకపోతుందా అని ఓపిక పట్టాను.

ఇంత జావ... పచ్చి మిరపకాయ.. ఉల్లిగడ్డకూడా లేదు. ఉంటే కోడలికివ్వాలి. పోనీ ఉద్యోగమిస్తాడు కంట్రాక్టరుకి లంచం బెడదామని తాకట్టుకి గొలుసిమ్మన్నా. ఆయమ్మ కాళికైపోయింది. ఇయ్యనుగాక యియ్యనంది.

''ఇది కూడా మీకిస్తే నాకు దిక్కేమిటి?'' అంది.

''నాకు ఉద్యోగం వస్తుంది గదా!'' అన్నాడు వెంకట్.

''అంత నమ్మకం ఉంటే అప్పు తెచ్చుకోండి... నా గొంతు కోశారు'' అని శోకంబెట్టింది.

ఆణ్ణి తనతో వాళ్ళయ్యదగ్గరికెళ్ళిపోయి రమ్మంది.

'నా తల్లిని తండ్రిని ఒగ్గెయ్యలేనని'' వీడు.

ఆ తల్లి అలిగి పడుకుంది. నా భార్య ఎలాగో అన్నం వడింది. మేమంతా జావ తాగాం. కంచంలో అన్నంపెట్టి మీరిచ్చిన ఊరగాయ ముక్కేసి కోడల్ని పిలిచింది. అన్నీ ఉంటే మేమూ బాగా చూసుకుందుం. రంగంలో ఉన్నప్పుడు నేనూ కోడికూర తిన్నోణ్ణి. ఏం చేస్తాం? ఓడలు బళ్ళు అవుతాయి. ఇది

మూర్ఛురాలు. నిలబడి పళ్ళాన్ని కాలితో ఒక తాపు తన్నింది. పళ్ళెం బోర్లాపడి అన్నం నేలంతా పడింది. మేం ముగ్గురం చూస్తున్నాం తల్లీ. మూడురోజుల్నుంచి జావతో పొట్టనింపుకుంటున్నాం.

వాడు ఒక్క ఊపులో వెళ్ళి దాన్ని లెంపకాయ కొట్టేసినాడు.

''నీకు నేను తిండిపెట్టలేను. పో, వెళ్ళిపో. ఎక్కడికి పోతావో... నీతండ్రి దగ్గరికే పోతావో మరెవడి దగ్గరికి పోతావో...'' అని దాన్ని తోసేసి వెళ్ళి పక్కమీద పడిపోయాడు.

అది వెళ్ళిపోయింది.

''అది వెళ్ళిపోయింది నాయనా' అని ఎంత లేపినా లేచాడు కాదు,.

రోజంతా అలాగే పడి ఉన్నాడు. రగులుకుంటున్న కట్టెలాగ పడిఉన్నాడు.

తెల్లారింది. నాకూతురు ఆఇంటా ఈఇంటా పనిచేస్తుంది. పాలూ, చీనీ తెచ్చింది. చాయ్ చేశాము. గ్లాసు పట్టుకెళ్ళి వాణ్ణి లేపింది. పడిన చెయ్యి జల్లుమన్నట్లు లాక్కుంది.

''నాయనోయ్'' అని ఒక్కటే కేక.

అందరం పరిగెట్టాం. ఏముంది. ఒంట్లో ప్రాణం లేదు. కట్టె. పక్కనే ఖాళీ మాత్రల సీసా.

నేను అందర్నీ జడిపిద్దామనుకున్నాను. నటించాను.

వాడు నిజంగానే చేసేసాడు.

'పెళ్ళాన్ని పొమ్మన్నాక ఇంక జన్మెందుకు అనుకున్నాడు తల్లీ. తల్లిని తండ్రిని కూడా గుర్తుంచుకోలేదు. అందరితో బంధం తెంచేసుకున్నాడు. నా కడుపు శోకం పెట్టాడు. దేవుడిట్లాగ రాశాడు తల్లీ.''

ఏమనటానికీ నోటమాట రాలేదు. వినటమైతే కథలా వినేశాను.

దేవుడు రాసిన రాత, నుదుటి గీత అంటారు.

తండ్రికీ ఉద్యోగంలేక కొడుక్కీ ఉద్యోగం లేకపోవటంవలన కదా ఇలా జరిగింది.

ఆ పిల్లది మాత్రం తప్పనటం ఎలా? ఆ పిల్ల అడిగిందీ కాదందీ తిండికోసమే కదా.

ఐదురూపాయలిచ్చి పంపాను. ఇవ్వటానికి నాదగ్గర ఉద్యోగాలు లేవుకదా!

1976

* * * *